నవభూమి
www.navabhoomi.in
5 విజయవాడ
ఆదివారం
17, జులై,2025

# ప్రగతి పురం కాలనీకి స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రారంభం

**దెందులూరు ఆగస్టు 16 నవభూమి :** తెలుగుదేశం ప్రభుత్వం పేదల అభివృద్ధి సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ప్రగతిపురం కాలనీ గ్రామానికి బస్సు లేక గత ఎనిమిది సంవత్సరాలగా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ బాబు ఆదేశాలతో మా ప్రగతి పురం గ్రామానికి బస్సు సౌకర్యం వచ్చిందని దీనికి కూటమి ప్రభుత్వం మహిళలకు. స్త్రీ శక్తి పథకంలో ద్వారా ఉచిత బస్సుని అందిస్తున్నందుకు ప్రగతి పురం గ్రామస్తులు అందరం ధన్యవాదాలు తెలుపుతున్నామని అయ్యప్ప రాజు గూడెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మేడికొండ ప్రసాద్, సునాని సాంబశివరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఖండవల్లి దావీదు, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బత్తుల ప్రసాద్, బూత్ ఇంచార్జ్ తొమంద్రు నాని, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు దాసరి రాంబాబు, దాసరి ప్రభాకర్ రావు మారుమూడి వెంకటరత్నం దాసరి జయరాజు సిలారపు రాంబాబు అన్నారు. శనివారం ప్రగతిపురం కాలనీకి కూటమి ప్రభుత్వం అందించిన మహిళలకు శ్రీ బస్సు పథకాన్ని ప్రగతి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి ప్రారంభించారు. మా ప్రగతిపురం కాలనీ సమస్యల పరిష్కారం అభివృద్ధికి సహకారం అందిస్తున్న చింతలపూడి శాసనసభ్యులు సొంగా బాబుకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు నారా లోకేష్ కు ప్రగతిపురం గ్రామస్తులు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు



# భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి అందరికి ఆదర్శ ప్రియులు




**దెందులూరు ఆగస్టు 16 నవభూమి :** భారతరత్న మాజీ దేశ ప్రధాని మాతృ భూమికోసం తన జీవితాన్ని అంకితం చేసి దేశ అభివృద్ధికి బాటలు పరిచిన ప్రపంచానికి భారత శక్తి రూపించి రుచి చూపించిన భారతరత్న మాజీ దేశ ప్రధాని అటల్ బిహారి వాజపేయి నేటి యువతకు ఆదర్శప్రాయాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గాలాయగూడెం సహకార సంఘం సొసైటీ డైరెక్టర్ మందూరి బుజ్జి గోపాల్ అన్నారు. శనివారం మాజీ ప్రధాని వాజపేయి వర్ధంతి సందర్భంగా స్థానిక భాజపా నాయకులు తోట ఆంజనేయులు, పలువురు నాయకులతో కలిసి మాజీ ప్రధాని అటల్ బిహారీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఆయన చేసిన సంక్షేమ పథకాలు కార్యక్రమాలను వివరించారు.

# మోదుగుమూడి ఆంజనేయులు సామ్రాజ్యం జ్ఞాపకార్థం గౌడ్ పేటలో బస్టాండ్ నిర్మాణానికి ఏర్పాటు



**దెందులూరు ఆగస్టు 16 నవభూమి :** చల్ల చింతలపూడి గ్రామంలో గ్రామస్తులు ప్రజలందరి సౌకర్యార్థం స్వర్గీయ తెలుగుదేశం పార్టీ పూర్వపు గ్రామ పార్టీ అధ్యక్షులు మోదుగు మోడీ ఆంజనేయులు సామ్రాజ్యం జ్ఞాపకార్థం వారి కుమారుడు గౌడ్ సంఘం దెందులూరు నియోజకవర్గ నాయకులు తెలుగుదేశం పార్టీ యువ నేత మొదుగుమూడి వెంకటరాజు (పండు) తన సొంత నగదు సుమారు రూ లక్ష 50 వేల రూపాయలతో గౌడ పేటలోని బస్సు షెల్టర్ ను చింతమనేని బస్సు షెల్టర్ గా నామకరణ చేసి నిర్మిస్తానని మొదుగుమూడి పండు తెలిపారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమన రాము గౌడ్, మండల పార్టీ కార్యదర్శి నాగన్న బోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ముమ్మడి మోహనరావు, మోదుమూడి రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుసులూరి ప్రసాద్, తూంపాటి ఆంజనేయులు, యర్రంశెట్టి నాగరాజు, పుసులూరు యుగంధర్, పుసులూరి సత్యనారాయణ అలియాస్ బోస్, తెలుగు యువత నాయకుడు మోదుగు మూడీ శ్రీనివాస్, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

# స్త్రీ శక్తి ఫ్రీ బస్సులో ప్రయాణించిన టిడిపి మహిళా నాయకురాలు కొల్లేరు సంక్షేమ సేవా సమితి చైర్ పర్సన్ ముంగర ఉమాదేవి



**దెందులూరు ఆగస్టు 16 నవభూమి :** దేశంలో తొలిసారిగా మహిళలకు ఆస్తిలో సమాన వాటా కల్పించిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను తీసుకువచ్చి ప్రతి మహిళను అభివృద్ధి పరిచి, ఇప్పుడు మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానిదేనని దెందులూరు నియోజకవర్గం మహిళ సీనియర్ నాయకురాలు, పైడి చింతపాడు గ్రామానికి చెందిన కొల్లేరు సంక్షేమ సేవా సమితి చైర్పర్సన్ ముంగ రమాదేవి అన్నారు. ప్రభుత్వం శ్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా బస్సును ప్రారంభించిన సందర్భంగా దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి, విజయవాడ ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అప్కాఫ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పలువురు ప్రముఖులతో కలిసి ఉచిత బస్సులో కొల్లేరు సంక్షేమ సేవా సమితి చైర్పర్సన్ ముంగర ఉమాదేవి ప్రయాణించి మహిళలతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఇది తెలుగుదేశం పార్టీ గొప్పతనం అని మాట ఇస్తే కట్టుబడి ప్రభుత్వం కూటను ప్రభుత్వం అని ముంగర ఉమాదేవి అన్నారు

# శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా నర్రవుల కుశాల్ నాగ కార్తికేయతో సందడి చేసిన ఎంపీ, ఎమ్మెల్యే



**దెందులూరు ఆగస్టు 16 నవభూమి :** శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సీతంపేట సొసైటీ బ్యాంకు అధ్యక్షులు నర్రావుల గంగాభవాని సత్యనారాయణ దంపతుల కుమారుడు నర్రావుల కుశాల నాగ కార్తికేయ శ్రీకృష్ణుడి వేషంలో కృష్ణాష్టమి సందర్భంగా సందడి చేయగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కార్తికేయను ఎత్తుకొని ముద్దాడి సందడి చేశారు. దెందులూరు మండల పార్టీ కార్యదర్శి నాగన్నబోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాము గౌడ్, సీతంపేట బ్యాంక్ అధ్యక్షులు యలమర్తి శీను బాబు,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుసులూరి ప్రసాద్ పుసులూరి యుగంధర్ తో పాటు పలువురు యాదవ సంఘం నాయకులు పార్టీ నాయకులు పాల్గొన్నారు



# చల్ల చింతలపూడిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**దెందులూరు ఆగస్టు 16 నవభూమి :** సర్వోన్నతమైన జీవితాన్ని ఆస్వాదించడానికి సన్మార్గంలో నడుచుకుంటూ జన్మకు సార్ధకత చేసుకోవాలని తోటి వారికి సహాయం పడుతూ ఆదర్శవంతమైన మంచి జీవన విధానంతో ముందుకు వెళ్లాలని శ్రీకృష్ణుని జీవిత సత్యం అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం దెందులూరు మండలం చల్ల చింతలపూడి శివారు యాదవుల పేటలో శ్రీ కృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో దెందులూరు మాజీ జెడ్పిటిసి, రైల్వే బోర్డు సభ్యులు ముమ్మడి సక్కుకుమారి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ముమ్మడి చింతయ్యయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ, మండల పార్టీ కార్యదర్శి నాగన్న బోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ముమ్మడి మోహనరావు, సీతంపేట సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు యలమర్తి శ్రీనివాసరావు,సీతంపేట సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ నరావుల గంగాభవాని , వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుసులూరి ప్రసాద్ తదితరులతో కలిసి శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని యాదవుల పేటలో సందడి చేశారు. శ్రీకృష్ణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం యాదవులతో కలిసి ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.పుసులూరి వెంకటేశ్వరరావు (శ్రీను),తుంపాటి ఆంజనేయులు,పుసులూరి బుజ్జి బాబు, తిమ్మన్నగూడెం గ్రామానికి చెందిన బ్యాంక్ డైరెక్టర్ నరావుల గంగాభవాని సత్యనారాయణ కుమారుడు కార్తికేయను శ్రీకృష్ణుని వేషంలో ఉండడంతో





చింతమనేని ఎంపీ ఎత్తుకొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేమన రాముగౌడ్, మోదిధమూడి రాంబాబు, మోదుగు మూడి పండు, తాళ్లురి నాగరాజు, మాజీ వార్డ్ నెంబర్ ముమ్మడి శ్రీనివాసరావు, నాగన్న బోయిన శ్రీనివాసరావు,తుంపాటి ఆంజనేయులు, పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు వచ్చి హాజరైన ఎంపీ మహేష్ యాదవ్కు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్కు శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వారిని సన్మానించారు

## వేగ జువెలర్స్ అంటే నాణ్యతకు,మన్నికకు

# ఒక బ్రాండ్‌గా నిలుస్తుంది

- వేగ జ్యువెలరీ షాప్‌ను ప్రారంభించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి
- అన్ని డిజైన్స్ ఆభరణాలను కలిగిన జ్యూవెలరీ సంస్థ వేగ

**అనంతపురం ఆగస్టు 16 నవభూమి :**వేగ జ్యువెలర్స్ అంటే నాణ్యతకు మన్నికకుకు ఒక బ్రాండ్ అని పుట్టపర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం రాజు రోడ్ లోని మాసినేని గ్రాండ్ లో ఏర్పాటు చేసిన వేగ జువెలర్స్ షాప్ ను శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, వినియోగదారులకు సరసమైన ధరల్లో ఎంతో నాణ్యమైన మన్నికైన అన్ని డిజైన్స్ తో తయారుచేసిన ఆభరణాలను అందించే జ్యూవెలరీ సంస్థల్లో వేగ జువెలర్స్ ప్రముఖంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాంటి పేరు ప్రఖ్యాతలుగాంచిన వేగ జ్యువెలర్స్ షాపు మన అనంతపురంలో ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు.వినియోగదారులకు ఎంతో నాణ్యమైన ,మన్నికైన అన్ని డిజైన్స్ తో కూడిన ఆభరణాలను ప్రజలకు అందించాలని నిర్వాహకులను కోరారు. ఆభరణాలు మహిళలకు ఎంతో అలంకారంగా ఉంటాయని అన్నారు. సమాజంలో ఆభరణాలు ధరించని వారు ఎవరు ఉండరు అని అయితే ఆభరణాలను కొనుగోలు చేసే విషయంతో వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆభరణాలు కొనుగోలు విషయంలో వినియోగదారులు ఎంతో ఆలోచన చేసి ఆభరణాల నాణ్యత , మన్నిక ,కొలతలు అన్ని ప్రామాణికాలు ఖచ్చితంగా ఉండే జ్యువెలరీ షాపులను ఎంచుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు.వినియోగదారులకు అన్ని రకాల ప్రామాణిక





విలువలు కలిగిన ఆభరణాలను ,డిజైన్లనుఅందించే జ్యూవెలరీ సంస్థ ల్లో వేగ ముందువరుసలో నిలుస్తుందనే నమ్మకం విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. మహిళలకు ఎంతో నమ్మకం ,విశ్వాసం కలిగించేలా వేగ జ్యువెలర్స్ ఉంటుందని ,మంచి మంచి డిజైన్స్ ఆభరణాలను అందించి మహిళల మన్ననలు పొందాలని ఆ జ్యువెలరీ సంస్థ నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో వేగ జువెలరీ షాప్ మేనేజర్ బాల దుర్గాప్రసాద్ ,వేగ జ్యువెలరీ షాప్ ఉద్యోగులు ,సిబ్బంది ,పలువురు నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల దొంగతనంపై ఒంగోలులో

# నేడు కాంగ్రెస్ క్యాండిల్ ర్యాలీ

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా

**ఒంగోలు ,ఆగస్టు 16 (నవభూమి):** ఎన్నికల కమిషన్ బిజెపితో కుమ్మక్కై ఓట్ల దొంగతనానికి పాల్పడు తున్నందుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈనెల 18వ తేదీన క్యాండిల్ ర్యాలీ నిరసన ల్లో భాగంగా ఒంగోలులో నేడు పెద్ద ఎత్తున జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా శనివారం ఒంగోలులో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ బిజెపితో కలిసి ఒక బీహార్ రాష్ట్రంలోనే 65 లక్షల పైగా ఓట్లను తొలగించింద ని, అలాగే దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారని ఆయన అన్నారు, ఒక్కొక్క పార్లమెంట్ స్థానంలో లక్ష ఓట్లకు పైగా పోలింగ్ అనంతరం డిజిటల్ ఓటర్ లిస్టులో చేరుస్తున్నారని ఒక్కొక్క అసెంబ్లీకి 25,000 వేలకు పైగా ఓట్లను చేర్చి బిజెపి గెలుపుకు దోహద పడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాహుల్ గాంధీ వెలికి తీసిన ఈ అతిపెద్ద ఓట్ల కుంభకోణంపై ఎలక్షన్ కమిషన్ సమాధానం చెప్పలేక దొంక తిరుగుడుగా మాట్లాడుతుందని , చివరకు సుప్రీం కోర్ట్ మొట్టికాయలు వేసిన ఏం చెప్పలేని స్థితిలో ఉందని,ఓట్ల దొంగ మోడీ దిగిపొమ్మని ఈనెల 18వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు ఒంగోలు మిరియాల పాలెం సెంటర్ లోగల అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ట్రంక్ రోడ్ మీదగా బాపూజీ కాంప్లెక్స్ వద్దగల మహాత్మా గాంధీ విగ్రహ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సైదా తెలిపారు ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇదా సుధాకర్ రెడ్డి,




రాష్ట్ర కేకేసి చైర్మన్ దర్శి నియోజకవర్గ ఇన్చార్జ్ కైపు కృష్ణారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జ్ పాలపర్తి విజేష్ రాజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, గోరంట్ల కోటేశ్వరరావు, తాతా శ్రీనివాసులు,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మన్నం ప్రసన్న రాజు, జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు ఉంగరాల శీను, జిల్లా లీగల్సెల్ అధ్యక్షులు సుదర్శ రవి, రాష్ట్ర మైనార్టీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫీ అహ్మద్, రాష్ట్ర కేకేసి కార్యదర్శి సుధీర్ వర్మ, ఈ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు ఇరిగినేని వెంకట నరసయ్య, షేక్ రవూఫ్, పైన%శీ% మధు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థ గత ఎన్నికల కంట్రోల్ బోర్డు చైర్మన్ బొడ్డు సతీష్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మహేష్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, జిల్లా కంట్రోల్ బోర్డు సభ్యులు కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

# చిల్లిస్ హాట్,స్పైసీ హొటల్‌ని ఆదరించాలి

- చిల్లిస్ హొటల్ అధినేత తోట నాగార్జున

**నెల్లూరు,ఆగస్టు 16, (నవభూమి)::** నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులో భవాని గెస్ట్ ఇన్ ఎదురుగా నూతన చిల్లిస్ హాట్,స్పైసీ హొటల్ ప్రారంభానికి చిల్లిస్ హాట్,స్పైసీ హొటల్ అధినేత తోట నాగార్జున,సంధ్యలు పాల్గొని.. బంధుమిత్రులతో కలిసి అట్టహాసంగా చిల్లిస్ హాట్,స్పైసీ హొటల్ ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చిల్లిస్






హాట్,స్పైసీ హొటల్ అధినేత తోట నాగార్జున మాట్లాడుతూ ఈ చిల్లిస్ హాట్,స్పైసీ హొటల్ కస్టమర్లు రుచులు నచ్చే విధంగా అన్ని రకాల హాట్ స్పైసీ తో పాటు బిరియాని కూడా అందుబాటులో ఉందన్నారు.ప్రజలందరూ చిల్లిస్ హాట్,స్పైసీ హొటల్ ని ఆదరించాలని కోరారు. త్వరలో స్విగ్గి,జొమాటో ఆన్లైన్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణ,ప్రశాంత్,నవీన్,ప్రవీణ్, బద్రి,అశోక్,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలే అభివృద్ధికి పట్టుకొమ్మలు

## చిన్న చిన్న వ్యాపారాలతో ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలి

## పెదవేగి టిడిపి మండల అధ్యక్షుడు ఈడుపుగంటి అనిల్ కుమార్





**దెందులూరు ఆగస్టు 16 నవభూమి. :** ప్రతి ఒక్కరూ చిన్న చిన్న వ్యాపారాలతో స్వయం శక్తితో వెతుకుతూ అభివృద్ధి చెందాలని గ్రామాలే రాష్ట్రానికి పట్టుకొమ్మలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెదవేగి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్ కుమార్ అన్నారు.పెదవేగి మండలం కే. కన్నాపురం గ్రామం లో ఈ రోజు కొత్తగా నిర్మించినటువంటి పుట్ట సూర్యప్రకాష్ గారి శ్రీ దుర్గ మనోహర్ మినీ రైస్ మిల్ ను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్ కుమార్ ప్రారంభించచారు. మీ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఒంగోలులో సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం

## నాయకుల పిలుపు




**ఆదోని, ఆగష్టు 16(నవభూమి ప్రతినిధి):** 28వ రాష్ట్ర మహాసభల పోస్టర్ల విడుదల చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ ఆగస్టు నెల 20.25 తేదీలలో ఒంగోలు నగరంలో సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు ఘనంగా జరుగుతున్నాయని ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈరోజు స్థానిక పార్టీ కార్యాలయము నందు పట్టణ సమితి ఆధ్వర్యంలో 28వ రాష్ట్ర మహాసభ పోస్టర్ల విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సంసిద్ధం కావాలని ప్రజలకి ఇచ్చినటువంటి సూపర్ 6 పథకాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాల అయినప్పటికీ పేదలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తిగా విఫలం చెందిందని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బిజెపి పాలన సాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా చేశారని మండిపడ్డారు. జరుగుతున్న రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేకతపై కార్యక్రమాలను రూపకల్పన చేసుకుని మరింత పోరాటానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు %ూ%.సుదర్శన్, పట్టణ కార్యదర్శి %ు%.వీరేష్, జిల్లా సమితి సభ్యులు అజయ్ బాబు, రైతు సంఘం నాయకులు బసాపురం గోపాల్ శాఖ కార్యదర్శి %ూ%.విజయ్ తదితరులు పాల్గొనడం జరిగింది

# చలో కరేడును జయప్రదం చేయండి

**అనంతసాగరం - నవభూమి :** ఆగస్టు 18వ తేదీన జరిగే చలో కరేడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అనంతసాగరం మండల రైతుసంఘం,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో కరేడు వాల్ పోస్టర్ లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో జరుగుతున్న బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 18వ తేదీ చలో కరేడు కార్యక్రమాన్ని జిల్లా రైతు సంఘులు,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. కరేడు గ్రామంలో సంవత్సరానికి మూడు పంటలు పండించే భూములను అదానీ కార్పొరేట్ సంస్థ అయిన ఇండో సోలార్ పరిశ్రమ కోసం ప్రభుత్వం చేపట్టిన బలవంత భూసేకరణను రద్దు చేయాలని రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.తమ భూములు ఇవ్వమని కరేడు రైతులు,ప్రజలు ఆ గ్రామంలో జరిగిన గ్రామసభలో జిల్లా అధికారుల సమక్షంలో ఏకగ్రీవ తీర్మానం చేశారని ఆ తీర్మానాన్ని అమలుపరచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సెజ్ ల పేరుతో అనేక వేల ఎకరాల భూములు పరిశ్రమల కోసం రైతుల నుంచి ప్రభుత్వం తీసుకున్నారని ఆ భూమిలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని అన్నారు.మొదట పరిశ్రమల కోసం తీసుకొన్న భూమిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి తర్వాత అవసరాల నిమిత్తం రైతుల వద్ద నుండి భూ సేకరణ చేయాలని అన్నారు. రైతు ల వద్ద నుండి బలవంతపు భూ సేకరణ చేయకూడదని రైతు సంఘం, ప్రజా సంఘాలు గా డిమాండ్ చేస్తామని అన్నారు.రైతుల నుండి బలవంతపు భూ సేకరణ జరుపుతున్న కరేడు గ్రామంలో జరిగే సభలో రైతులు, ప్రజలు పాల్గొని చలో కరేడు కార్యక్రమం జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్ బాషా,రైతు సంఘం మండల కార్యదర్శి మస్తాన్, రైతు సంఘం మండల నాయకులు డాక్టర్ సుబ్బారాయుడు,గాడి సుధాకర్, పెద్ద మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.





## బడుగు వర్గాల పోరాటయోధుడు గౌతు లచ్చన్న

**అనంతపురం ఆగస్టు 16 నవభూమి :**ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు మాజీ మంత్రి సర్దార్ గౌతు లచ్చన్న బడుగు వర్గాల పోరాటయోధుడు అని మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కొనియాడారు.పుట్టపర్తి కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 116 వ జయంతోత్సవాల సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు గౌతు లచ్చన్న దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే బిరుదు పొందిన ఏకైక వ్యక్తి లచ్చన్న అన్నారు. సాహసానికి కార్యదక్షతకు మెచ్చిన ప్రజలే ఈ సర్దార్ అనే బిరుదును లచ్చన్నకు ఇచ్చారని గుర్తు చేశారు. తాడిత పీడిత ప్రజల అభ్యున్నతి కోసం ఆయన జీవితకాలం కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ప్రజల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోతారన్నారు .నేటి యువతరానికి గౌతు లచ్చన్న జీవితం ఆదర్శంగా నిలుస్తుందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తోపాటు కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు అధికారులు కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మపాలెంలో మొక్కలు నాటిన టిడిపి నాయకులు

### పారిశుధ్య పరిరక్షణకు గ్రామస్తులు సహకరించాలి



**దెందులూరు ఆగస్టు 16 నవభూమి :** గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అమ్మపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్ రవి కిషోర్ అన్నారు.పెదవేగి మండలం, అమ్మపాలెం గ్రామంలో 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఘనంగా మువ్వన్నెలా జెండా ను ఆవిష్కరణ చేసి, అలనాటి స్వాతంత్ర సమరయోధులను మళ్ళీ ఒక్కసారి స్మరించుకొని, గ్రామ సభ ను ఏర్పాటు చేసి, అజెండా లో ముఖ్యమైన పాయింట్స్ ను చేర్చి, గ్రామసభలో చెర్చించుకోవడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి ఎన్ రవి కిషోర్ తెలిపారు. సర్పంచ్ ఉప సర్పంచ్ చందు గంగాధరరావు పోలిశెట్టి వీరయ్య వార్డ్ మెంబర్ నక్క దుర్గారావు జనసేన నాయకులు హరీష్, సచివాలయం సిబ్బంది స్కూల్ పిల్లలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## సిసి రోడ్లుకు నిధులు కేటాయించడంపై హర్షం

### అభివృద్ధిపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన సంఘస్తులు



**ఎమ్మిగనూరు, ఆగస్టు 16(నవభూమి):** సిసి రోడ్లు, అభివృద్ధి చేయడంపై ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి కీ స్థానిక సంఘ పెద్దలుకృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పట్టణ ఎంబి ఎరుషలేము సంఘము కౌన్సిల్ కదిరికోట షాలేము ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యేను కలవడం జరిగింది. ఎమ్మిగనూరు పట్టణ పరిధిలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఎస్సీ కాలనీ ఎంబి చర్చి దగ్గర నుండి కలగొట్ల రోడ్డు గౌస్ హొటల్ దాకా సిసి రోడ్డు వేయించడం జరిగింది. అందుకుగాను కౌన్సిల్ సంఘ సెక్రటరీ భాస్కర్ బాబు, జాయింట్ సెక్రెటరీ తిమ్మరాజు, పౌలు, ట్రెజరర్ రాజశేఖర్, కౌన్సిల్ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది పట్టణ ఎస్సీ స్మశాన వాటిక ప్రహరీ గోడ కొరకు నిర్మాణం కొరకు చర్చి వెనకాల ఖాళీ స్థలం కొరకు ఎస్సీ కాలనీలో స్థలంలో పరిహార గోడ నిర్మించాలని సంఘస్తులు ఎమ్మెల్యే కి వినతిపత్రం అందజేయడం జరిగింది.సానుకూలంగా ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి స్పందించడం జరిగింది. పట్టణ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అదిరికోట షలేము మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, తోనే ఎమ్మిగనూరు పట్టణ అభివృద్ధి సాధ్యమని హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

### పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు

**మాడుగుల ఆగస్టు 17 నవభూమి:** నియోజక వర్గం లోని దేవరాపల్లి , పెదనందిపల్లి గ్రామాల్లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు పురస్కరించుకొని నియోజక వర్గం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి వారి అన్న ప్రసాదాన్ని భక్తులకు అందించారు.ఈ కార్యక్రమం లో భక్తులు అధికంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



### చంద్రబాబు ఎన్నికల ముందు

# ఎన్నో హామీలు ఇచ్చారు

- అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తున్నారు
- ఆడబిడ్డ నిధి, యువతకు నిరుద్యోగ భృతి ఏదీ?
- 50 ఏళ్లకే పింఛన్ ఇస్తాన్న హామీ ఏమైంది?
- ఉచిత బస్సు ప్రయాణమంటూనే ఆంక్షలా?

**అనంతపురం, ఆగస్టు 16 నవభూమి బ్యూరో :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ప్రసంగంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిగజారి మాట్లాడారని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. "సరసమైన ధరలకు నాణ్యమైన మద్యం ఇస్తున్నామనడం సిగ్గుచేటు..సీఎం స్థాయిలో ఉండి ఇలా మాట్లాడతారా? యువతకు మీరిచ్చే సందేశం ఇదేనా?" అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెందిన చంద్రబాబు ప్రతి విషయంలోనూ ప్రచార ఆర్భాటం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తోందన్నారు. తొలి ఏడాది పాలనలో సూపర్ సిక్స్ హామీ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రెండో ఏడాదిలో కోతలు, ఆంక్షలు పెట్టి పథకాలు అమలు ప్రారంభించారని విమర్శించారు. తొలి ఏడాది చంద్రబాబు ఇచ్చిన హామీల విలువ అక్షరాలా రూ.80 వేల కోట్లని తెలిపారు. ఆ మేరకు ప్రజలకు బాకీ పడ్డారని తెలిపారు. కూటమి రెండో ఏడాది పాలనలో అన్నదాత సుఖీభవ ప్రారంభిస్తే అందులోనూ కోతలు పెట్టారన్నారు. ఎన్నికలకు ముందు రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు కేంద్రంతో కలిపి రూ.20 వేలు అంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో 7 లక్షల మందికి కోత పెట్టారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఇప్పుడు ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు. కనీసం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఫ్రీబస్సు పథకం అమలు చేసినట్టుగా కూడా ఇక్కడ చేయడం లేదన్నారు. అంతర్ రాష్ట్ర సర్వీసులు, ఎక్స్‌ప్రెస్, నాన్‌స్టాప్, లగ్జరీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం ఏంటని ప్రశ్నించారు. చివరకు తిరుమలకు వెళ్లేందుకు కూడా మహిళలకు అవకాశం లేకుండాపోయిందన్నారు. ఇదంతా ఎవరిని మోసం చేయడానికని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఈ పథకం ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. 50 ఏళ్లకే పింఛన్ అందిస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. కేవలం ఆర్భాట ప్రచారాల కోసమే చంద్రబాబు పరిమితం అవుతున్నారని మండిపడ్డారు.పోలీసుల ఉదాసీనత వల్లే శ్రావణి ఆత్మహత్య చంద్రబాబు పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు ప్రజాప్రతినిధుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారని ధ్వజమెత్తారు. "ఇటీవల అనంతపురంలో విద్యార్థిని తన్మయి హత్య జరిగింది. ఆ రోజు పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే ఈరోజు తన్మయి బతికుండేది. ఈ ఘటనపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగితే సీఐను సస్పెండ్ చేశారు. ఈ రోజు పోలీసుల ఉదాసీనత కారణంగా కళ్యాణదుర్గంలో వివాహిత శ్రావణి ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆడియో రికార్డులు వింటుంటే మనసుకు ఆవేదన కలుగుతోంది.




శ్రావణి దీనస్థితిలో మాట్లాడింది. కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రంలో డీఎస్పీ, సీఐ వంటి ఉన్నతాధికారులు ఉంటారు. తన కుటుంబంలోని పరిణామాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని శ్రావణి ఆడియో ద్వారా స్పష్టమవుతోంది. పైగా తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా న్యాయం చేయలేదని ఆమె చెప్పింది. మరీ ఇంత దారుణమా? పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడితే అక్కడున్న అధికారులు విచారణ చేస్తారని చెబుతున్నారు. నిజంగా అక్కడ పోలీసుల వల్ల ఆమెకు న్యాయం జరిగి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా? శ్రావణి మృతిపై సమగ్ర విచారణ చేయాలి. ఉదాసీనంగా వ్యవహరించిన పోలీసులు ఎవరు? తెలుగుదేశం నాయకులు ఎవరో బహిర్గతం చేయాలి. వారిపై చర్యలు తీసుకోవాలి" అని అనంత డిమాండ్ చేశారు. ..బాబు పాలనలో రైతుల పరిస్థితి దయనీయం చంద్రబాబు పాలనలో రైతాంగం పరిస్థితి దయనీయంగా మారిందని అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. "జిల్లాలో 2024%-%2025 ఖరీఫ్, రబీలో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్నాయి. 2024 బీమా పరిహారం ఇవ్వలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విత్తనం నుంచి విక్రయం వరకు ప్రభుత్వమే రైతులకు అండగా ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. గతంలో పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. కానీ నేడు రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి. ఖరీఫ్ సీజనల్‌లో రాష్ట్రంలో 86 లక్షల ఎకరాల్లో ప్రీమియం కట్టేవాళ్లు. కానీ నేడు కేవలం 14 లక్షల ఎకరాలకు మాత్రమే ప్రీమియం కట్టిన పరిస్థితి ఉంది" అని అనంత తెలిపారు.. ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి పెట్టరా?ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్, జూలై, ఆగస్టు తొలి వారం వరకు వర్షాల జాడ లేదని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇలాంటి తరుణంలో ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి పెట్టరా? అని ప్రశ్నించారు. "ఖరీఫ్‌లో ఆగస్టు మొదటి వారం వరకు వర్షాలు పడలేదు. పంటలు ఎండిపోయాయి. కొన్ని చోట్ల వాడుపోయే పరిస్థితికి వచ్చింది. అయినా ప్రత్యామ్నాయ పంటల సాగు విషయంలో కనీసం ప్రణాళిక లేదు. వేరుశనగ, పత్తి, ఆముదం, కంది పంటలు పెట్టడానికి సీజన్ లేదు. ఇతర పంటలు వేసుకోవాలి. కానీ ఇంత వరకు ఒక్క సమావేశం జరగలేదు. అసలు ప్రజాప్రతినిధులు ఉన్నారా? వాళ్లకు ఆదాయం మీద ఉన్న దృష్టి రైతాంగ సమస్యలపై లేదు. ఎక్కడ చూసినా యూరియా, డీఏపీ కొరత వేధిస్తోంది. టన్నుల కొద్దీ యూరియా వస్తున్నా రైతులకు అందడం లేదు. బ్లాక్‌లో బస్తాకు అదనంగా రూ.100 చెల్లిస్తే అందిస్తున్నారు. అసలు డిస్ట్రిబ్యూటర్ల నుంచి యూరియా ఎక్కడకు వెళ్తోంది? ఏ డిస్ట్రిబ్యూటర్‌కు ఎంత వచ్చింది? ఎక్కడకు వెళ్తోంది? అనేది సమీక్షించరా?" అని అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు.

# మనిషి జీవితానికి నేత్రాలే వెలుగు

- నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు అభినందనీయం
- మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



**అనంతపురం ఆగస్టు 16 నవభూమి:** ప్రతి మనిషికి కళ్లు ఎంతో ప్రధానమైనవని మన జీవితాలకు ఆ నేత్రాలే వెలుగులని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని మాజీ మంత్రి ఉచిత కంటి వైద్య పరీక్షల నిర్వాహకులను కొనియాడారు. పుట్టపర్తి మండలంలోని జగరాజు పల్లి లో ప్రభాస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సహకారంతో సంస్థ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి మనిషికి నేత్రాలు ఎంతో ముఖ్యమైనవి అన్నారు. మనిషికి కళ్ళు లేకపోతే జీవితమంతా అంధకారమే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం బిజీగా గడుపుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ గడుపుతున్న ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించడానికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. బెంగళూరుకు చెందిన మంజునాథ నేత్రాలయం వారి సహకారంతో ఈరోజు జగరాజుపల్లికి చెందిన ప్రభాస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు అనిల్ కుమార్ ,సికిందర్ తోపాటు మరికొంత మంది వైద్య బృందం సుమారు 127 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి ఆరోగ్య వైద్య శిబిరాలు అందించేందుకు యువత ముందుకు రావాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం



సంస్థ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ కంటి ఉచిత వైద్య శిబిరానికి 127 మంది హాజరయ్యారని, వీరిలో 37 మందికి కంటి వైద్య చికిత్సలు అవసరమని గుర్తించి వీరిని చికిత్స నిమిత్తం బెంగళూరులోని మంజునాథ నేత్రాలయ ఆసుపత్రికి పంపిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి భారీగా తరలి వచ్చి సహాయ సహకారాలు అందించిన గ్రామస్తులకు,స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంజునాథ నేత్రాలయ వైద్యులు స్కాట్లాండ్ , దక్షిణాఫ్రికాకు చెందిన అంగీలా డిక్సన్ , లలిత అనూఫ్ ,రేఖ, జగరాజుపల్లికి చెందిన టిడిపి నాయకులు మురళి ధర్ రెడ్డి, కూటమి పార్టీల నాయకులు కన్వీనర్ విజయ్ కుమార్, శ్రీరామ్ రెడ్డి ,బొమ్మయ్య ,శ్రీరాం నాయక్, స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మన్యంలో విభిన్న వాతావరణం

**పాడేరు, నవభూమి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మన్యంలో శనివారం విభిన్నమైన వాతావరణం నెలకొంది. గత కొన్నాళ్లుగా ఏజెన్సీలో ముసురు వాతావరణం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దానికి అల్పపీడనం తోడు కావడంతో ఎప్పుడు ఎటువంటి వాతావరణం నెలకొంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. శనివారం తెల్లవారుజామున పొగమంచు కురవగా ఉదయం వేళలో జల్లులతో కూడిన వర్షం పడింది. కాని పది గంటల తర్వాత మబ్బు వాతావరణం నెలకొంది. మళ్లీ ఒంటి నుంచి వాతావరణం పూర్తిగా మారిపోయి భారీ వర్షం కురిసింది. అయితే జిల్లా కేంద్రం పాడేరులో కంటే ఘాట్ మార్గంలో కుండపోతగా వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సుమారు గంట సమయం భారీ వర్షం కురిసింది. దీంతో ఘాట్‌లోని మంచు మేఘాలు అలముకున్నాయి. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. కేవలం గంటన్నర వ్యవధిలోనే స్థానిక ఘాట్ మార్గంలో భారీ వర్షం. మంచు మేఘాలతో విభిన్నమైన వాతావరణం నెలకొంది.స్థిరంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు మన్యంలో ముసురు వాతావరణం కొనసాగుతున్నా గరిష్ఠ ఉష్ణోగ్రతలు మాత్రం స్థిరంగానే కొనసాగుతున్నాయి. దీంతో శనివారం కొయ్యూరులో 32.9 డిగ్రీల



సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా జి.మాడుగులలో 28.8, అనంతగిరిలో 28.6, చింతపల్లిలో 27.7, పాడేరులో 27.6, పెదబయలులో 27.0, డుంబ్రిగుడలో 26.0, అరకులోయలో 25.7, ముంచంగిపుట్టులో 24.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## పాడి పశువుల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి



**మాడుగుల ఆగస్టు 17 నవభూమి:** భారీ వర్షాల కారణంగా పాడి రైతులు పశువుల విషయం లో అప్రమత్తంగా ఉండాలని , పలు జాగ్రత్తలు తీసుకోవాలని మాడుగుల ఏరియా పశు వైద్య సహాయక సంచాలకులు డాక్టర్. వి. చిట్టి నాయుడు శనివారం తెలిపారు.పశువుల విషయం లో చాలా అప్రమత్తంగా ఉండాలని , పశువులను కొట్లాలలో కానీ , పశువుల షెడ్లు , పాకలు లో కానీ తాళ్ళ తో గట్టిగా కట్టకూడదని అన్నారు. అలాగే పాడు బడ్డ పశువుల శాలలో ఉంచకూడదని , నీరు అధికంగా ఉండే గుంటలు , చెరువులు , కాలువలు , జలాశయాల వద్దకు పశువులను , గొర్రెలను , మేకలను పంపవద్దని సూచించారు.అలాగే వర్షం కురుస్తున్న సమయంలో పశువులను చెట్ల కింద ఉంచకుడదని తెలిపారు.

## నారాయణలో ఘనంగా పంద్రాగస్టు




**ఆదోని, ఆగస్టు15 (నవభూమి ప్రతినిధి):** స్థానిక ఆదోని నారాయణ పాఠశాలలో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమమును, నారాయణ పాఠశాల ఏజీఎం రమేష్ కుమార్ అధ్యక్షతన, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ కె. ఈరన్న పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం అనేక మంది ప్రాణ ధన మాన త్యాగ ఫలితంగా వచ్చిందని, అలాంటి దేశాన్ని మనమందరం గౌరవించాలని, విద్యార్థులందరూ క్రమశిక్షణతో ఉండాలని అలా ఉంటే నేటి బాలలే రేపటి పౌరులు అవుతారని తెలియజేశారు. తదనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, ఈరోజుకి బ్రిటిష్ వాళ్ళ సంకెళ్ల నుండి విముక్తి పొంది 79 సంవత్సరాలు అయిందని, భారతదేశంలో ఉండే ప్రజలందరూ స్వేచ్ఛ సమానత్వ సౌభ్రాతృత్వం తో కలిసి మెలిసి ఉండాలని, ప్రతి ఒక్కరూ దేశంలో శాంతి భద్రతను నెలకొల్పాలని అలా చేసినప్పుడే మన దేశానికి నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు దేశ నాయకుల వేషాధారణను ధరించి అందర్నీ ఆశ్చర్యపరిచారు, పలువురు ఉపాధ్యాయులు దేశ స్వతంత్రం గురించి స్పీచెస్ కూడా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు మిగతా సిబ్బంది అందరూ పాల్గొని విజయవంతం చేశారు.

## మాడుగులలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**మాడుగుల ఆగస్టు 17 నవభూమి:**మాడుగుల మండలం లోని శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం మాడుగుల లో స్థానిక శ్రీ వేణు గోపాలస్వామి వారి ఆలయం , శ్రీ పార్థ సారథి స్వామి వారి ఆలయం లో భక్తులు స్వామి వారికి పంచామృత అభిషేకాలు , సహస్రనామ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలం లోని ఎమ్.కోడూరు గ్రామం లో శ్రీ వేణు గోపాలస్వామి వారి ఆలయం లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రాంబాబు ఆధ్వర్యం లో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి.గ్రామం లోని భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సీతారాముల భజన బృందం ఆధ్వర్యం లో భజన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం లో భక్తులు అధికంగా పాల్గొన్నారు.

## పోతునూరులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**దెందులూరు ఆగస్టు 16 నవభూమి :** శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని పోతునూరు గ్రామంలో శ్రీకృష్ణుని దేవాలయంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు.దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నున్న లక్ష్మణ్ బాబు శ్రీమతి పద్మావతి దంపతులు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు డొక్కు వెంకటేశ్వరరావు,నున్న శివ భవాని, చవల శివ, పలువురు యాదవ సంఘం నాయకులు ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుని దర్శించుకున్నారు. తలారి రామకృష్ణ, నాగన్న బోయిన ఉయ్యూరు, కొప్పుల చినబాబు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా స్వామి వారి రథం నడిపారు.భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



నవభూమి

www.navabhoomi.in

8 విజయవాడ

ఆదివారం

17, జులై,2025


## పర్యాటక ప్రాంతాలు కిటకిట



**పాడేరు, నవభూమి:-** ఏజెన్సీలోని సందర్శనీయ ప్రదేశాలు శనివారం పర్యాటకులతో కిటకిటలాడాయి. వీకెండ్‌లో వరుసగా సెలవులు రావడంతో పర్యాటకులు మన్యం బాట పట్టారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే వివిధ ప్రాంతాల నుంచి ఏజెన్సీకి సందర్శకులు విచ్చేశారు. దీంతో శనివారం అనంతగిరి మండలం బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు సందర్శకుల సందడి నెలకొంది. ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో ఏజెన్సీలోని ప్రకృతి అందాలు మరింత సుందరంగా ఉండడంతో వాటిని తిలకించేందుకు సందర్శనీయ ప్రదేశాలకు వస్తున్నారు. అలాగే వర్షాల నేపథ్యంలో అనంతగిరి మండలంలో కటిక, తాడిగూడ జలపాతాలు, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి, చింతపల్లి మండలంలోని యర్రవరం జలపాతాల్లోకి పర్యాటకుల్ని అనుమతించకపోవడంతో ఎక్కువ మంది అనంతగిరి మండలం బొర్రా గుహలు, అరకులోయ మండలంలో గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, చింతపల్లి మండలంలో తాజంగి, చెరువువేనం, లంబసింగి ప్రాంతాలను శనివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. అలాగే ఆదివారం సైతం మరింతగా పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. దీంతో పాడేరు, అరకులోయ ప్రాంతాలు శనివారం సైతం రద్దీగా మారాయి.అరకులోయలో..అరకులోయ: వరుస సెలవులు రావడంతో అరకులోయలో శనివారం పర్యాటకుల సందడి కనిపించింది. శుక్ర, శని, ఆదివారాలు సెలవులు కావడంతో అరకులోయ సందర్శనకు పెద్ద ఎత్తున పర్యాటకులు విచ్చేశారు. దీంతో సందర్శిత ప్రాంతాలైన ట్రైబల్ మ్యూజియం, పద్మాపురం గార్డెన్, గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట వుడెన్‌బ్రిడ్జి, మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌ల వద్ద సందర్శకుల రద్దీ కనిపించింది.

## వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తతగా ఉండాలి

### కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం .ఆగస్టు 16. (నవభూమి ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వ హణ స్పందన సంస్థ వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు శనివారం జిల్లాస్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని డ్రైన్లు కాలువల గట్లు పూడికలు తొలగించాలని సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వివరాలు తెలుసుకోవాలని వెనుకకు రప్పించాలని, అదేవిధంగా రానున్న రెండు రోజులు మత్స్యకారులు ఎవరు సముద్రంపై వేటకు వెళ్ళ రాదని సూచించారు. కోనసీమ జిల్లాలోని ప్రజలు అత్యవసర పరిస్థితులు ఉంటే మాత్రమే బయటకు రావాలని అదేవిధంగా ఎటువంటి ప్రయాణాలు చేయరాదనీ ప్రజానీకానికి తెలియజే యాలన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నందు 08856 293104 ఫోను సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందనీ అత్యవసర పరిస్థితులలో ఈ నెంబర్లో సంప్రదించి సహాయం కోరవ చు న్నవారు డివిజన్ స్థాయిలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లాలోని అన్ని పాఠశా లలో భవన స్థితిగతులను పరిశీలించి శిథిలావస్థలో ఉన్న ఎడల అవసరమైతే మరియొక పాఠశాలకు విద్యార్థినీ విద్యార్థులను తరలించాలని ఆదేశించారు అందరూ డివిజనల్ అధికారులు తమ పరిధిలోని రెవిన్యూ పోలీస్ ఎలక్ట్రికల్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా తగు చర్యలు తీసు కోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## జలపాతాలు తాత్కాలిక మూసివేత



**అనంతగిరి, నవభూమి:-** ఏజెన్సీ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాలు ఉప్పొంగుతున్నాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జలపాతాల వద్దకు వెళ్లే క్రమంలో గెడ్డలు దాటుతూ గిరిజనులు, పర్యాటకులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జలపాతాల సౌందర్యాన్ని చూడడానికి వెళ్లిన పర్యాటకులు ఆకస్మికంగా గెడ్డలు పొంగుతుండడంతో ఆవలి వైపు చిక్కుకుంటున్నారు. కొంతమంది గిరిజనులు ఇంటికీ చేరాలనే ఆతృతతో పొంగుతున్న గెడ్డలు దాటేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ కుటుంబానికి శోకాన్ని మిగులుస్తున్నారు. ఇలా గెడ్డలను దాటే క్రమంలో గత ఏడాది ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం జలపాతాలను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. అంతేకాకుండా గెడ్డలను దాటవద్దంటూ రెవెన్యూ, పోలీసు అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.'సరియా' వద్ద రెండు సార్లు చిక్కుకున్న పర్యాటకులు మండలంలోని సరియా జలపాతం వద్ద రెండు నెలల క్రితం పర్యాటకులు చిక్కుకున్నారు. జలపాతం అందాలను తిలకించేందుకు వెళ్లగా ఆకస్మికంగా గెడ్డ పొంగడంతో పది మంది పర్యాటకులు ఉండిపోయారు. దీంతో స్థానికులు వారిని జాగ్రత్తగా గెడ్డ దాటించడంతో బయటపడ్డారు. తాజాగా ఈనెల 12వ తేదీన మంగళవారం సరియా జలపాతాన్ని తిలకించేందుకు గెడ్డ అవతలి వైపు వెళ్లగా.. ఎగువన పడిన భారీ వర్షానికి గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో 31 మంది పర్యాటకులు ఆవలి వైపు ఉండిపోయారు. పోలీస్ శాఖ అప్రమత్తం కావడంతో ఐదు గంటలు శ్రమించి 31 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ప్రస్తుతం జలపాతాన్ని మూసివేశారు. పర్యాటకులకు అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. వలంటీర్లను అప్రమత్తం చేసి, జలపాతాలకు ఎవరికి వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.మిచాంగ్ తుఫాన్‌లో ముగ్గురు మృతి 2023లోని మిచాంగ్ తుఫాన్ సమయంలో భీంపోల్ పంచాయతీలో గల లువ్వా గెడ్డకు భారీగా వరద నీరు పోటెత్తింది. కాజ్‌వే పైనుంచి దాటే క్రమంలోని సీతపాడు గ్రామానికి చెందిన గెమ్మెల లక్ష్మి, గెమ్మెల కుమార్, మిరియాల కమల గల్లంతై మృత్యువాత పడ్డారు. అదే ఏడాది నాలుగు రోజుల వ్యవధిలో పెదబయలు మండలంలోని పెదకొడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు గ్రామానికి చెందిన కిల్లో రామకృష్ణ మత్స్యగెడ్డలో చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు.జలపాతాలను మూసివేశాం వీరభద్రచారి, తహశీల్దార్, అనంతగిరి మండలంలోని సరియా, కటికి, తాటిగుడ జలపాతాలు మూసివేస్తూ ఆదేశాలు జారీ చేశాం. ఆయా గ్రామాల వీఆర్‌వోలు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటకులకు అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించాం. వరద ఉధృతి తగ్గే వరకు జలపాతాలకు అనుమతించం.జలపాతాల వద్దకు వెళ్లొద్దు డీ శ్రీనివాసరావు, ఎస్ఐ, అనంతగిరి వర్షకాలంలో జలపాతాలు కనువిందు చేస్తాయనే ఆలోచనతో పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. గెడ్డలు ఆకస్మికంగా పొంగడంతో జలపాతాల వద్దకు వచ్చిన పర్యాటకులు చిక్కుకుంటున్నారు. అందువల్ల వర్షాకాలంలో జలపాతాల వద్దకు పర్యాటకులు రావద్దు. జలపాతాలను మూసివేశాం. గెడ్డలను దాటే ప్రయత్నాలు, చేపల వేటకు వెళ్లవద్దని గిరిజనులకు అవగాహన కల్పించాం.

## గౌతు లచ్చన్న జయంతి వేడుకల్లో జడ్పీ చైర్మన్ గిరిజమ్మ





**అనంతపురం ఆగస్టు 16 నవభూమి:**అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం లోని ప్రధాన సమావేశ భవనంలో"సర్దార్ గౌతు లచ్చన్న" జయంతి ఉత్సవాలలో ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో మొదటగా లచ్చన్న చిత్ర పటానికి పుష్ప నివాళులు అర్పించారు, అనంతరం సభను ఉద్దేశించి జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ, సర్దార్ గౌతు లచ్చన్న వెనకబడిన తరగతులకు ఎనలేని సేవలు అందించిన గౌతు లచ్చన్న ని సంస్మరించుకోవడం మనందరికీ భాద్యత అని, వారి సేవలు భావితరాలకు ఎంతో ఆదర్శంగా, ఆచరణీయంగా ఉంటాయని, అలాగే భారతదేశ చరిత్రలో సర్దార్ అని ప్రజల చేత బిరుదు పొందిన రెండవ వ్యక్తి మన గౌతు లచ్చన్న అని కొనియాడారు. కార్యదక్షత, కార్యశీలత సాహసానికి మరో పేరుగా గౌతులచ్చెన్ననీ ప్రజలందరూ కొనియాడతారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## భాష్యం స్కూల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**ఎమ్మిగనూరు, ఆగస్టు 16 (నవభూమి):** పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో విద్యాసంస్థల అధినేత రామకృష్ణ జెడ్ఈవో అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ మాచాని కవిత ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులు పాల్గొని శ్రీకృష్ణుని వేషధారణలో బాలబాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు . ప్రిన్సిపల్ మాచాని కవిత మాట్లాడుతూ సాక్షాత్తు విష్ణు స్వరూపం అయిన శ్రీకృష్ణుడు గురువు దగ్గర విద్యానభ్యసించి గురుదక్షిణ సమర్పించుకున్నాడని శ్రీకృష్ణుని లీలలను వివరించడం జరిగింది. ఇందులో ఉపాధ్యాయ బృందం కూడా పాల్గొన్నారు .

## మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న పివిఎస్ టి రాంప్రసాద్



**నెల్లూరు,ఆగస్టు 16,(నవభూమి)::**రెవెన్యూ, అనుబంధం శాఖలకు ఉపయోగపడే విలువైన సమాచారాన్ని వెబ్సైట్ ద్వారా స్వయంగా డిజైన్ చేసి.. విశిష్ట సేవలు అందిస్తున్నందుకు తోటపల్లి గూడూరు మండల సహాయ గణాంక అధికారి పీవీఎస్ టి రాంప్రసాద్ కు 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ చేతుల మీదుగా తోటపల్లి గూడూరు మండల సహాయ గణాంక అధికారి పీ వివిఎస్ టి రాంప్రసాద్ ప్రశంసా పత్ర పురస్కారం అందుకున్నారు.ప్రశంస పత్రాన్ని అందుకున్న రాంప్రసాద్ కు నెల్లూరు రెవిన్యూ డివిజనల్ అధికారిణి వారు రాంప్రసాద్ ను ప్రత్యేకంగా అభినందించారు.ఇలాగే అంకితభావంతో కూడిన విధి నిర్వహణతో మరిన్ని శిఖరాలు అందుకోవాలని కోరుతూ.. సహోద్యోగులు అభినందించారు.

## వేర్వేరు ఘటనల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం

**పలాస, నవభూమి:-** వేర్వేరు రెండు ఘటనల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఒడిశాకు చెందిన ఐదుగురుని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన ఇందుకు సం బంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మోహన్‌బ్లాక్ రాయ్‌జుకా గ్రామానికి చెందిన అనిసెంట్ నాయక్, బురుంగసాహి గ్రామానికి చెందిన మోహిత్ బిరా, మోహనబ్లాక్‌కు చెందిన రబిత్ బిర్లా స్నేహితులు. వీరు కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్యామ్యూల్‌తో కలిసి గంజాయి వ్యాపారాన్ని ప్రారంభించారు. కిలోకు రూ.8 వేలు చొప్పున ఒడిశావాసులు ఇస్తుండడంతో దీన్నే వ్యాపారంగా చేసుకున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి పలాస రైల్వేస్టేషన్ వద్ద పది కిలోల గంజాయితో రైలు ఎక్కేందుకు సిద్ధం కావడంతో కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా వారు పట్టుబడ్డారు. వీరి నుంచి పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గుమ్మా, అడవ గ్రామాలకు చెందిన సురుసింగ్, సమిత్ అభిహోయ్ సంతల్లో పండ్లు కొనుగోలు చేసుకొని ఇతర ప్రాంతాలకు అమ్ముతూ స్నేహితులయ్యారు. వీటితోపాటు గంజాయి రవాణా చేస్తే అధిక డబ్బులు సంపాదించవచ్చని భావించారు. ఈ క్రమంలో పలాస రైల్వే స్టేషన్ వద్ద బ్రోకర్లకు గంజాయిని అప్పగిస్తే కిలోకు రూ.వెయ్యి ఇస్తారని సురుసింగ్‌కు అభిహోయ్ చెప్పాడు.

## మిన్నంటిన టీడీపీ సంబరాలు







**ములకలచెరువు, నవభూమి:-** వైఎస్ కుటుంబానికి కంచుకోటగా నిలిచిన పులివెందులలో టీడీపీ విజయఢంకా మోగిం చడం, పులివెందుల ప్రజల తీర్పు జగన్‌కు చెంపపెట్టు అని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడం తో గురువారం నేతలు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. భారీ ఎత్తున బాణ సంచా పేల్చి కేక్‌ను కట్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల ప్రజ లకు ఒక రోజు ముందే స్వాతంత్ర్యం వచ్చింద న్నారు. జగన్‌పై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో పులివెందుల తీర్పే నిదర్శనమన్నారు. 30 ఏళ్ల తరువాత ప్రజాస్వామ్యబద్ధంగా జరిగి న ఎన్నికల్లో ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడు సుపరిపాలనకు ఓట్లేశారన్నారు. పులివెందులలో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా ఇవ్వకుండా తగిన బుద్ధి చెప్పారన్నారు. గతంలో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచుల ఎన్నికల్లో పోలీసులను అడ్డుపెట్టు కుని టీడీపీ నేతల నామినేషన్లు చించి రౌడీ యిజం చేసి దౌర్జన్యంగా ఏకగ్రీవం చేసుకున్న విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. రానున్న స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నిక లు జరిపి టీడీపీ జెండా రెపరెపలాడిస్తామన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సు రేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ర మణ, నేతలు తులసీధర్‌నాయుడు, గంజి మో హన, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బ నాయుడు, కట్టా హరినాథ్, నాగిరెడ్డి, పాస్టర్ శ్రీనివాసులు, రమ ణారెడ్డి, నీలకంఠారెడ్డి, శంకర పాల్గొన్నారు.బీటలు బారిన జగన్ కోట...జగన్ కంచుకోటకు బీటలుబారాయని క్లస్టర్ ఇన్‌చార్జి మునిరత్నం అన్నారు. పులివెందుల జడ్పీటీసీకి డిపాజిట్టు కూడా రాకపోవడం, ఒంటిమిట్ట జడ్పీటీసీ సానాల్లో టీడీపీ విజభేరి మోగిచడంతో టీడీపీ నేతలు బస్టాండులో బాణసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. పులివెందుల ప్రజలు స్వేచ్ఛ కోరుకుని స్వచ్ఛ దంగా ఓటు వేసి టీడీపీకి పట్టంకట్టినట్లు తెలి పారు. రాబోయే ఎన్నికలకు ఇది పునాదిలాం టిదని తెలిపారు. యవత అ?ధ్యక్షుడు చినబా బు, విజయ్, మురళి, సూర్యప్రకాష్, రాజన్న, చంద్రాయుడు, లక్ష్మన్న, భూపతి పాల్గొన్నారు.గుర్రంకొండలో సంబరాలు పులి వెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీ పీ విజయం సాధించడంతో గుర్రంకొండలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బస్టాండులో బాణసంచా పేల్చారు.కార్యక్ర మంలో నేతలు జగదీష్, చంద్రబాబు, చలమా రెడ్డి, నౌషాద్‌అహ్మద్, సుధాకర్, మహాత్మారెడ్డి, సాగర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.దద్దరిల్లిన హరిత కూడలి పులివెం దుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించడం తో టీడీపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని హరిత కూడలి వద్ద పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. ప్రభుత్వ పాలనను ప్ర జలు మెచ్చి ఇచ్చిన తీర్పు పులివెందుల జడ్పీ టీసీ గెలుపన్నారు. ఈ విజయం ముమ్మాటికీ అభివృద్ధిని కోరుకునే ప్రజలదని, అభివృద్ధికి అడుగులు నేర్పుతున్న టీడీపీదే అన్నారు. టీడీ పీ మాజీ మండలాధ్యక్షుడు ఉత్తమ్‌రెడ్డి, మల్ల య్యకొండ మాజీ చైర్మన్ గంగుల్‌రెడ్డి, జడ్పీ టీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, ఎస్ఎంసీ చైర్మన్లు వీరాంజనేయులు, శివ, నరేంద్ర నా యుడు, కాలా నారాయణ, సుధాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.పరిఢవిల్లిన ప్రజాస్వామ్యంపులివెందు లలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లిందని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు అపూర్వ విజ యం సాధించడంతో పీలేరులోని టీడీపీ శ్రేణు లు ఘనంగా సంబరాలు చేసుకున్నాయి. టీడీ పీ నేతలు స్వీట్లు పంచడమే కాక బాణ సం చా పేల్చి తమ హర్షం వ్యక్తం చేశారు.వైసీపీ అధికారంలో ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం వైసీపీ నేతలు సాగించిన దమ నకాండ రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదన్నారు. టీడీపీ అధి కారంలో ఉన్నప్పటికీ ఎటువంటి అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడకుండా ప్రజా స్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించి స్పష్ట మైన ఓటరు తీర్పుతో రెండు జడ్పీటీసీ స్థానాలను కైవశం చేసుకుందన్నారు. కార్యక్రమంలో పీలే రు ఏఎంసీ అధ్యక్షులు పురం రామ్మూర్తి, డైరెక్టర్ పఠాన్ రహంతుల్లా, నేతలు పోలిశెట్టి సురేంద్ర, నాగేంద్ర, ఖాదర్, చంద్రమ్మ, సలీం, తదితరులు పాల్గొన్నారు.వాల్మీకిపురంలో కూటమి సంబరాలు పులివెందుల, ఒంటిమిట్టల్లో జరిగిన ఉపఎన్ని కల్లో టీడీపీ ఘనవిజయం సాధించడం పట్ల పట్టణంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో సం బరాలు చేసుకున్నారు. స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద నేతలు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. వైసీపీకి కంచుకోటకు బీటలు బారడం టీడీపీ జయకేతనం సీఎం నారా చంద్రబాబునాయుడు సుపరిపాలనకు నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్ర జలకు మేలు జరుగుతుందంటే అది ఒక్క చం ద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం ఒక రికొకరు స్వీట్లు తినిపించుకుంటూ జైచంద్రబా బు నినాదాలతో హోరెత్తించారు. మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, నేతలు రాజేంద్రా చారి, పీవీ నారాయణ, బొక్కసం రామకృష్ణ, జాఫర్, చాను, రామాంజులరెడ్డి, డిష్ బ్రదర్స్, రామచంద్ర, కాలనీ రమేష్, ఆదినారాయణ, శివారెడ్డి, గంగులప్ప, దండువారిపల్లె రమణ, రామకృష్ణ, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.టీడీపీ శ్రేణుల సంబరాలు పులివెందు ల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో ఆపా ర్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కలకడ లో పార్టీ జెండాను ప్రదర్శిస్తూ మిఠాయిలను పంచారు. గెలుపుపొందిన అభ్యర్థులు మారెడ్డి లతారెడ్డి, ముద్దుక్రిష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో నేతలు వై.జిలానీ, ముబారక్‌అలీ, నౌషాద్, ఇర్ఫాన్, ఖాజా, జాఫ ర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**బాపట్ల - నవభూమి :** బాపట్ల పట్టణంలోని 32 వ వార్డు పడమర యాదవపాలెం లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను నర్రా వెంకటరావు, నక్క గోపి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్రా వెంకటరావు, నక్క గోపి మీడియా వారితో మాట్లాడుతూ ప్రజలందరికి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలందరికీ సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు కృష్ణుడు ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నామన్నారు అనంతరం యువకులు పెద్దలు యాదవపాలెం ప్రజలు అందరూ కలిసి కేక్ కటింగ్, ఉట్టి కొట్టే కార్యక్రమం, ఆటపాటలతో సందడిగా చేశారు.

## ఈ వార్డెన్ మాకొద్దు

**పాతపట్నం నవభూమి:-** ఈ వార్డెన్ మాకొద్దంటూ స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహ విద్యార్థినులు ఆందోళన చేశారు. స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో వాచ్‌మన్(మహిళ)పై వార్డెన్ సుశీల దాడిచేయడంతో శుక్రవారం అలజడి నెలకొంది. ఈ నేపథ్యంలో బాలికలు అధికారులకిచ్చిన సమాచారం మేరకు కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఇతర అధికారులతో కలిసి వసతిగృహాన్ని సందర్శిం చేందుకు శుక్రవారం సాయంత్రం వచ్చారు. అయితే సెలవురోజున విజిట్ చేయడాని మీరెవరంటూ సుమారు అరగంటపైబడే లోపలకు రానీయకుండా వాదించారు. దీంతో పోలీసుల సాయంతో తహసీల్దార్ వసతి గృహం లోపలకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ వార్డెన్ మాకొద్దంటూ విద్యార్థినులు పడు తునన అవస్థలు వివరించారు. వార్డెన్ బూతులు తిడుతుందంటూ వాపోయా రు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి ముందుకొస్తే బెదిరిస్తుందని తెలిపారు. కలెక్టర్, డీడీలకే కాలర్ పట్టుకు అడిగేదానిని మీరెంత అంటూ ఎమైనా ఫిర్యాదు చేస్తే తరువాత ఉంటాది జాగ్రత్త అని హుకుం చెలాయిస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వార్డెన్ మేడం, మనుమల బట్టలు సైతం మాచేతనే ఉతికిస్తుందని, లేకుంటే కొడతారన్నారు. సాయంత్రమైతే చాలు వసతిగృహం నుంచి సరుకులు మూటలుగా బయటకు తరలిపోతున్నాయని తెలిపారు. మెనూ పాటించకుండా రోజూ వంకాయ కూరే పెడుతున్నారన్నారు. మరమ్మతు పనులు కూడా మాచేతే చేయిస్తుంటరన్నారు. వార్డెన్ కారుడ్రైవర్ ఎప్పుడూ హా స్టల్‌లోనే ఉంటాడు. హాస్టల్‌లో మారుమూలలోనే తిరుగుతూ ఉండడం కొన్ని సార్లు ఇబ్బందిగా ఉంటుందన్నారు. అదే మాపేరెంట్స్ వస్తే లోపలికి కూడా రానీయడం లేదని వాపోయారు. హాస్టల్‌లో ఉండడం చాలా ఇబ్బందిగా ఉంద న్నారు. దీనిపై ఏఎస్‌డబ్ల్యూవో శ్యామలను తహసీల్దార్ ప్రశ్నించగా.. పలుమా ర్లు షోకాజ్ నోటీసులు ఇచ్చినా తిరిగి సమాధానం లేదని, ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈవార్డెన్ ఉంటే మేము హాస్టల్‌లో ఉండలేమని వెంటనే మార్చేయాలని విద్యార్థినులంతా ఉమ్మడిగా తహసీల్దార్‌ను కోరారు. ఎంపీడీవో పి.చంద్రకుమారి, ఎస్ఐ బి.లావణ్య తదితరులు ఉన్నారు.



## రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

**రాజంపేట, నవభూమి:-** రాజంపేట జిల్లా కేంద్రం చేయాలంటూ రాజంపేట జిల్లా సాధన సమితి సభ్యులు సమావేశం నిర్వహించారు. రాజంపేట ఆర్అండ్‌బి ఆవరణంలో జిల్లా సాధన సమితి కన్వీనర్, న్యాయవాది టి.లక్ష్మీనారాయణ, ప్రైవేటు పాఠశాలల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, జిల్లా డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు గీతాంజలి రమణ తదితరుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో చారిత్రక పర్యాటక ప్రాంతమైన అన్ని వనరులు కలిగిన పార్లమెంట్, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రాజంపేటను గత జగన్ ప్రభుత్వం దురుద్దేశ్యంతో జిల్లాకేంద్రం చేయలేదని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏర్పాటు చేసిన నూతన జిల్లాల మంత్రుల సబ్‌కమిటీ త్వరలో సమావేశాలు జరుగుతున్నందున రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ తీర్మానించారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ గతంలో అనేక ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు చేసిన ఆందోళనలు వినతులను జగన్ ప్రభుత్వం బూడిదలో పోసిన పన్నీరుగా మార్చిందన్నారు.ఈ సమయంలో ఒంటిమిట్టను ఆంధ్ర భద్రాద్రిగా చేసినట్లు విమానాశ్రయం, రైల్వే, ఇతర అన్ని అర్హతలున్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్నారు. బ్రిటీష్ హయాంలో కంటే ముందు 105 సంవత్సరాల కిందట రాజంపేట రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేసి సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటు చేయడానికి అన్ని వనరులు అర్హతలుఉన్నఈ ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేయాలంటూ తీర్మానించారు.